క్లుప్తంగా

అప్పనపల్లి బాలాజీ ఆలయానికి భక్తుల తాకిడి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనానికి శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో స్వామివారి ఆలయం కోలాహలంగా మారింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున స్వామి వారికి సుప్రభాత సేవను ఆలయ అర్చకులు ఘనంగా జరిపించారు. తొలిహారతి అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,92,542 ఆదాయం వచ్చింది. స్వామివారి నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.64,080 విరాళాలుగా అందించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. లడ్డూ ప్రసా దం విక్రయం ద్వారా రూ.62,370 వచ్చిందన్నారు. నాలుగు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,700 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. మండలంలో చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

గెడ్డంవారిపేటలో పాఠశాలను కొనసాగించాలి

మామిడికుదురు: అప్పనపల్లి గెడ్డంవారిపేట స్కూల్‌లో 3, 4, 5 తరగతులను విలీనం చేయాలని కోరుతూ సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, సొసైటీ మాజీ చైర్మన్ గెడ్డం వెంకటేశ్వరరావు, స్థానికులు ఎంఈఓ లక్ష్మీనారాయణకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో గెడ్డంవారిపేటలో కొనసాగిన మూడు తరగతులను జెడ్పీహెచ్ స్కూల్‌లో విలీనం చేశారన్నారు. గెడ్డంవారిపేటకు హైస్కూల్ దూరంలో ఉండడంతోపాటు ప్రధాన రహదారిపై రద్దీగా ఉండడం, కుక్కల బెడదతో 3, 4, 5 తరగతుల విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం ఆ మూడు తరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వారు ప్రైవేటు స్కూల్స్‌ను ఆశ్రయించే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం చేపట్టిన విలీన ప్రక్రియలో తిరిగి పూర్వపు మాదిరిగానే స్కూల్‌ను కొనసాగించాలన్నారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు అందజేస్తున్న రాంబాబు

మామిడికుదురు: నామన ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. నామన కృష్ణవేణి స్మారకార్థం 100 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. డాక్టర్లు నామన వినోద్, నామన శృతి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతోనే ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ బొలిశెట్టి జయరామ్, సొసైటీ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి ప్రభుదాసు, సరెళ్ల సత్యనారాయణ, కుంపట్ల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేయాలి

అంబాజీపేట: ఇసుకపూడి శివారు దాసరివారిపేటలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించి, నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. 2009లో సామాజిక భవనాన్ని నిర్మించేందుకు నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారు. అయితే ఆ నిధులు సరిపడక అసంపూర్తిగా నిర్మించి గాలికొదిలేశారు. అప్పటి నుంచి భవనాన్ని నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం వినియోగంలో లేకపోవడంతో శిథిలస్థితికి చేరుతుంది. తక్షణమే భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్.మూలపాలెంలో షూటింగ్ సందడి

అయినవిల్లి: ఎస్.మూలపాలెం గ్రామంలో ఇస్త్రిబండి లఘు చిత్రం నిర్మాత దుర్గాదేవ్ కథ, నిర్మత, దర్శకుడు, హీరోగా గ్రామీణ నేపథ్యంలో ప్రేమ కథా చిత్రం రూపొందిస్తున్నారు. చిత్ర షూటింగ్ వారం రోజులపాటు ఇక్కడే జరగనుంది. ప్రణీంద్ర దేవరపల్లి ఈ సినిమాలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. హీరోయిన్‌గా అన్విష నటిస్తున్నారు. కెమేరామన్‌గా నాగార్జున వ్యవహరిస్తున్నారు. ఇప్పటికి 50 శాతం సినిమా పూర్తి చేశారు. ఇస్త్రిబండి, చాయ్‌చోటు, ప్రవీణ్ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ బయోపిక్‌తో 50 లఘు చిత్రాలను చిత్రీకరించానని దుర్గాదేవ్ తెలిపారు. ఇస్త్రిబండి చిత్రానికి అవార్డులు వచ్చాయని తెలిపారు. కోనసీమ పరిసర ప్రాంతాలైన అయినవిల్లి మండలంలోని ఎస్.మూలపాలెం, మాగం గ్రామాల్లో చిత్రసన్నివేశాలు చిత్రీకరిస్తున్నామన్నారు.

మోతాదు మించితే అనర్థమే..

- జోరుగా రబీ వరి సాగు
- అధికంగా రసాయనిక ఎరువుల వాడకం
- పెరుగుతున్న ఖర్చు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న వ్యవసాయాధికారులు



మొసలపల్లిలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

అంబాజీపేట: విత్తనాలు చల్లింది మొదలు రైతులు మొత్తం ఎరువులు పురుగు మందులతోనే సహవాసం చేస్తున్నారు. సస్యరక్షణకు అవసరమైన మోతాదులో, వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందుల వినియోగంతో రైతులకు అనవసర వ్యయాన్ని పెరుగుతుంది. రైతులు నిపుణుల సూచనలు పక్కన పెట్టి వెర్రిగా రసాయనాలు వినియోగించి అనవసర వ్యయంతో నష్టపోతున్నారు. దీనివల్ల చీడపీడల బెడద మరింత పెరిగిపోవడమే కాక ఎక్కువగా ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల ఏ మాత్రం ఫలితం ఉండదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు ఏమాత్రం వరి పైరు తేడాగా కనిపించినా, ఒకటి ఆరా దోమలు కనిపించిన వెంటనే రసాయనాలు ఆశ్రయిస్తున్నారు. వరినారు వేసే వారం తిరగకుండానే అప్పుడే ఎరువుల వాడకం ముమ్మరమైంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 22,384, కొత్తపేట నియోజకవర్గంలో 18,322, రాజోలు నియోజకవర్గంలో 9,387 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో రబీ వరి సాగు చేస్తున్నారు. నాట్లు వేసిన రైతులు రెండు వారాలు తిరగకుండానే మొదటి దఫా ఎరువులు వేయడం పూర్తి చేసినట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. సాగులో కొద్దిపాటి మెళకువలు పాటిస్తూ, రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు పొలంబడి ద్వారా అందిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు అనవసర వ్యయం తగ్గడంతోపాటు, అధిక దిగుబడి సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఎరువుల వాడకం ఇలా..

ఒక హెక్టారు పొలానికి 78 కిలోల నత్రజని ఎరువును మూడు భాగాలుగా చేసి ఒక భాగం దమ్ములో, మరో భాగం నాటిన రెండు వారాల తర్వాత, మూడో భాగం నెల రోజులు తర్వాత వేసుకోవాలి. కానీ రైతులు నాటిన వారం రోజులకే నత్రజని ఎరువు వేస్తున్నారు. దీనిని వేప పిండితో కలిపి వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. భాస్వరం, డీఏపీ లేదా కాంప్లెక్స్ రూపంలో ఒకే దఫాగా, వేసుకోవాలి. జింక్ లోపం ఉన్నట్టుగుర్తిస్తే ఒక గ్రాము జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

శనైశ్చరునికి తైలాభిషేకం

- అధిక సంఖ్యలో భక్తుల పూజలు
- రూ.1.52 లక్షల ఆదాయం



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రాజమౌళికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం సిబ్బంది

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర(శనైశ్చర)స్వామి వారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ-ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.1,30,160, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.22,780తో మొత్తం రూ.1,52,940 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

రాజమౌళి ప్రత్యేక పూజలు

సీఎంఓ, ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ రాజమౌళి శనైశ్చర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు, తైలాభిషేకం నిర్వహించారు. వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, పూజాధికాలు చేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆర్‌డీఓ పీ శ్రీకర్, తహసీల్దార్ వై.రాంబాబు, ఆర్ఐ పీ రవిశంకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం



పినపళ్లలో చిన్నారుల టీకాల ప్రక్రియను పరిశీలిస్తున్న హెచ్‌వీ ఉమ

ఆలమూరు: చిన్నారులకు సకాలంలో టీకాలను వేయించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కొత్తపేట డివిజన్ అదనపు వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం నిర్వహించిన చిన్నారులకు టీకాల ప్రక్రియను ఆమె పరిశీలించారు. వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు-2, కలవచర్ల, పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, మోదుకూరు, మడికి, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 150 మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్. హెచ్‌ఈలు బి.సూర్యనారాయణ, ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్..బాలామణి పర్యవేక్షించారు. చిన్నారులకు దనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటా వాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హైపటైటీస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి ప్రమీలారాణి

రాజోలు: జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి కోరారు. శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు మాట్లాడుతూ వచ్చే నెల 8వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. రాజీ చేసుకోవడం ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని కక్షిదారులకు వివరించాలన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు విముక్తి లభిస్తుందన్నారు.రాజోలు సీఐ నరేష్ కుమార్, రాజోలు, నగరం, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు, రాజోలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొల్లమండల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, న్యాయవాదులు ఆకుల భాస్కరరావు, మెడబల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాకనపాలెంలో ఆర్థిక అక్షరాస్యతపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మామిడికుదురు: ప్రధాన మంత్రి సురక్ష యోజన, జీవన జ్యోతి బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఫైనాన్షియల్ లిటరసీ ఎస్.విజయ్‌కుమార్, కౌన్సిలర్ జి.ప్రసాద్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శనివారం మాకనపాలెంలో ఉపాధి హామీ కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒక సారి విధిగా ఒక్క లావాదేవీ అయినా నిర్వహించాలన్నారు. లేని పక్షంలో అకౌంట్ పని చేయదన్నారు. ప్రధానమంత్రి సురక్షా యోజనలో ప్రతి ఏడాది రూ.20 చెల్లించిన 18 నుంచి 70 ఏళ్ల వారికి ప్రమాద బీమా రూ.2 లక్షలు వస్తుందన్నారు. ఈ పథకంలో అంగ వైకల్యం పొందిన వారికి కూడా సహాయం అందుతుందని చెప్పారు. జీవన జ్యోతి బీమా పథకంలో ఏడాదికి రూ.436 చెల్లించిన 18 నుంచి 50 ఏళ్ల వారికి సహజ మరణానికి కూడా రూ.2 లక్షలు సహాయం అందుతుందన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, ఇతర కార్మికులకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

డీఈఓ షేక్ సలీంబాషా



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షేక్ సలీంబాషా

అయినవిల్లి: ఉపాధ్యాయులు మెరుగైన బోధనా పద్ధతులను అలవర్చుకుని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా తెలిపారు. శనివారం ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయ సమావేశాలను ఆయన ప్రారంభించారు. డీఈఓ షేక్ సలీంబాషా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులు అలవరచుకొని మెరుగైన బోధన చేయాలన్నారు. సీ, డీ గ్రేడు విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు. పాఠశాల వారీగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఫలితాల సాధనకి కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిరిపల్లిలో క్లస్టర్‌లో మూడు హైస్కూల్స్, 15 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. సిలబస్‌పై ఆయన చర్చించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, విలస, మాగాం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీవీ రవి ప్రసాద్, వి.శరభరాజు, రిసోర్సు పర్సన్స్ జి.సాయి శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, డి.సత్యనారాయణ, ఎ.కొండలరావులు, డి.వి.విరామ కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రావులపాలెం: వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం క్లస్టర్ పరిధిలోని టీచర్లకు బోధనా అంశాలపై శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈఓలు నాగకుమార్, శ్రీనివాసరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించవచ్చని సూచించారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది టీచర్లకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అంబాజీపేట: ఇరుసుమండలో ఉన్న శివాలయం ప్రాంగణంలో ఉన్న గణపతి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, మార్జనలు, ప్రాశనలు, పీఠార్చన, మహాపూర్ణాహుతి, గోదృష్టి, దీక్షా విసర్జన పండిత ఆశీర్వచనాలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా చేశారు.

స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్‌తో పల్లెల్లో పరిశుభ్రం



ఆలమూరులో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉద్యోగులు



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ సరోవర్



కొత్తపేట డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ కేపీ రాజు, అధ్యాపకులు



మామిడికుదురు కార్యక్రమంలో పాల్గొన్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

ఆలమూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయని, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఎంపీడీఓ ఏ రాజు అన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర.., స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద అధికారులు, ఉద్యోగులందరూ సంయుక్తంగా భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి స్వచ్ఛాంధ్ర ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నచోట స్థానికులతో కలిసి అధికారులందరూ చీపుర్లను చేతబట్టి పారిశుద్ధ్య చర్యలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అంబాజీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరు బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ జి.వి.సరోవర్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట శివారు పీర్మాయిపాలెం ప్రధాన రహదారి పక్కన చెత్తను పొక్లెయిన్ సాయంతో శనివారం తొలగించారు. అలాగే స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు.

స్వచ్ఛ సంకల్పంతో..

కొత్తపేట: స్వచ్ఛ సంకల్పంతో పారిశుధ్యాన్ని పరిరక్షించుకుందామని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పిలుపునిచ్చారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో కళాశాల ఆవరణలో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు స్వచ్ఛత కోసం ఒక అడుగు ముందుకు అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకురాలు విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిచర్లపాలెంలో

మలికిపురం: స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శుక్రవారం మేడిచర్ల పాలెంలో పారిశుద్య పనులను నిర్వహించారు. మెయిన్ రోడ్డు పక్కన గల చెత్తను జేసీబీ సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శ్రీహరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

మామిడికుదురు: స్వచ్ఛాంధ్రా-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని విద్యాశాఖ సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మామిడికుదురు శాఖ గ్రంథాలయంతోపాటు మామిడికుదురు గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోను ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో ఎఈఓ మోకా వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, పంచాయతీ కార్యదర్శి పీవీ ఆర్‌కే రాజు, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ ఉద్యోగులు, గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ, ఈదరాడ బీడీసీ యెరుబండి కన్నబాబు, స్వీపరు దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం తడి, పొడి చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కళాశాల ఆవరణ నుంచి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.

బీజేపీ కార్యాలయానికి రెండు సెంట్ల భూమి వితరణ

సఖినేటిపల్లి: మండల బీజేపీ కార్యాలయ భవన నిర్మాణానికి పార్టీ రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు రూ.6లక్షల విలువ చేసే రెండు సెంట్లు భూమిని వితరణ చేశారు. శనివారం గొంది గ్రామంలో జరిగిన మండల పార్టీ సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రకటించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన జరిగినపై సమావేశంలో శివరామకృష్ణంరాజును పలువురు సీనియర్ నాయకులు శాలువాతో సత్కరించారు. కాగా సమావేశంలో మండల పార్టీ నూతన కార్యవర్గాన్ని సురేష్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా బోణం నాయుడు, గుబ్బల నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఐదుగురు, కార్యదర్శులుగా నలుగురుతో కలిపి మొత్తం 15 మంది కార్యవర్గ సభ్యులను ఆయన నియమించినట్టు చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, సీనియర్ నాయకులు పట్టపు సూర్యప్రకాశరావు, ఇందుకూరి సుబ్బరాజు, కె.సత్తిబాబు, పి.గణపతి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ



గురుమూర్తిని పరామర్శిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో పాశర్లపూడికి చెందిన పసలపూడి గురుమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. అతడిని పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్, అయినవిల్లి జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు శనివారం పలకరించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఆయన వెంట పార్టీ నేతలు కొమ్ముల రాము, తోరం భాస్కర్, కొనుకు నాగరాజు, నెల్లి దుర్గాప్రసాద్, చిక్కం బుజ్జిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, జక్కంపూడి వాసు, తోరం గౌతమ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల నూతన కార్యవర్గం



కొత్తపేటలో నూతన కార్యవర్గంతో పాలూరి

కొత్తపేట: బీజేపీని బూత్ స్థాయి నుంచీ బలోపేతం చేసేందుకు పార్టీలో ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు నివాసంలో ఆయన అధ్యక్షతన మండల పార్టీ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం, నియోజకవర్గ పరిశీలకులు చీకురుమిల్లి శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మండల నాయకులు ఏకాభిప్రాయంతో నూతన మండల కమిటీని మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా ఇళ్ల పల్లంశెట్టి, సబ్బవరపు సత్యనారాయణ, పాలూరి వెంకటలక్ష్మి, కోటిపల్లి సుబ్బలక్ష్మి, కేసవరపు సత్యనారాయణ, దొడ్డిపట్ల శ్రీనివాస్‌ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా బల్ల మూలాస్వామి, సూరవరపు సాయిప్రకాష్, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యదర్శి గొలకోటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ(జేపీ), భమిడి పాటి లక్ష్మీనారాయణ, అన్యం సత్యనారాయణ, అవసరాల దివ్య, పెన్నాడ నారాయణరావు, టి.ఆంజనేయులు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి: విలస గ్రామంలో మాగం ఒకటో నంబర్ కాలువ గట్టు కొప్పిశెట్టి వారి పాలెంలో కోదండరామస్వామి వారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో ఈ పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారిని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి మండల జెడ్పీటీసీ సభ్యులు గన్నవరపు శ్రీనివాసరావు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట అంబాజీపేట మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కుచర్లపాటి కృష్ణరాజు, విలస గ్రామ సర్పంచ్ కుసుమ లిల్లీమంగేస్కర్, విలస ఉపసర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, విలస మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: నర్సిపూడి పడమట వీధిలో పునః నిర్మించిన శ్రీరామాలయంలో శనివారం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ వేద పండితులు కాశీ శేఖరబాబు ఆచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ పురోహితుల బృందం విగ్రహాలను నెలకొల్పారు, పరిసర ప్రాంతాల నుంచి అధికం సంఖ్యలో భక్తులు విచ్చేసి దేవతామూర్తులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.భారీ అన్నసమారాధన జరిగింది.